


ఇబ్బందులను 'సాక్షి'తో పంచుకుంటున్న కాలనీ వాసులు



నిరసన తెలుపుతున్న స్థానికులు

మీతో సాక్షి

అటు ఇటు పూర్తి.. మధ్యలో నిలిచి!

1.5 కిలో మీటర్లలో నాలా విస్తరణ పనులు దాదాపు పూర్తి

- కేవలం 200 మీటర్ల మేర ఆగిన పనులు
- ఈ స్థలం ప్రైవేట్ వ్యక్తిది కావడంతో ముందుకు సాగని వైనం
- మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికుల వేడుకోలు

ప్రైవేట్ వ్యక్తి స్థలం నుంచి నాలా పనులు.. కోర్టు స్టే

నిజాంపేట్: వర్షా కాలంలో వరద నివారణ కోసం.. ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రెండు సంవత్సరాల క్రితం నాలాల విస్తరణ పనులు మొదులు పెట్టారు. ఎస్ఎన్‌డీపీ(స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం.) పనులు సుమారు రూ.3 కోట్లతో 1.5 కిలో మీటర్ల మేర పనులు జరిగాయి. శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు చేపట్టిన ఈ పనుల పట్ల స్థానిక ప్రజలు నాడు ఎంతో సంతోషించారు. కానీ రూ.3 కోట్లతో పూర్తి చేసిన పనులు 200 మీటర్ల స్థలంలో నిలిచి పోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో స్థానికులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆ స్థలం ప్రైవేట్ వ్యక్తిది కావడంతో అతను కోర్టు ద్వారా స్టే తెచ్చుకున్నాడు. దీంతో పనులు నిలిచిపోయాయి. పనులను పూర్తి చేయాలని ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా.. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అసలు సమస్య ఇదే..

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాచుపల్లిలోని భైరుని చెరువు నుంచి కాసాని కౌసాల్య కాలనీలోని మందెల కుంట వరకు సుమారు 1.5 కిలో మీటర్ల దూరం ఎస్ఎన్‌డీపీ నాలా విస్తరణ పనులను కార్పొరేషన్ అధికారులు చేపట్టారు. ఇందులో 99 శాతం పనులు పూర్తయ్యాయి. కానీ కాసాని కృష్ణ కాలనీ వెనుక ఓ ప్రైవేట్ స్థలం ఉంది. ఈ స్థలం తనదంటూ సదరు వ్యక్తి కోర్టుకు వెళ్లి తన స్థలం నుంచి నాలా పనులను చేపట్టకుండా స్టే తెచ్చుకున్నాడు. అయితే ఈ ప్రైవేట్ స్థలం ఇటు బాచుపల్లి నుంచి కౌసాల్య కాలనీ వరకు ఉన్న నాలాకు సరిగ్గా మధ్యలో ఉంటుంది. ఇప్పటికే ఎస్ఎన్‌డీపీ పనులను ప్రారంభించిన అధికారులు స్టే ఉన్న సుమారు 200 మీటర్ల వరకు నాలా పనులు చేపట్టలేదు. ఇటు బాచుపల్లి వైపు, అటు కౌసాల్య కాలనీ వైపు పనులను పూర్తి చేశారు. సదరు స్థలం యజమాని తన స్థలం సుమారు 300 గజాల వరకు నాలా నిర్మాణంలో పోతుందని, తనకు నష్టపరిహారం ప్రస్తుతం మార్కెట్ వాల్యూ ప్రకారం ఇస్తే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని అప్పట్లో అధికారులకు చెప్పినట్లు సమాచారం. ఒక వేళ నాలా దిశను మార్చడానికి కూడా అనుకూలంగా లేదు. ఓ వైపు గేటెడ్ కమ్యూనిటీ కాలనీ ఉంది. మరో వైపు ఖాళీ స్థలం ఉన్నా అది కూడా ప్రైవేట్ భూమి కావడంతో సమస్యకు పరిష్కారం లభించడం లేదు. దీంతో నాలాలో రెండు వైపుల వరద నీరు, డ్రైనేజీ నీరు చేరి ప్రవహించకుండా నిల్వ ఉండటంతోనే అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.



నాలాలో నిలిచిన మురుగునీరు



నాలా పనులు పెండింగ్ ఉన్న ప్రాంతం

నాలా ఎటు పోయింది..

భైరుని చెరువు నుంచి మందెల కుంట వరకు ఉన్న ఈ నాలా ఇక్కడి ప్రాంతంలో కనిపించడం లేదు. అసలు ఎక్కడ మిస్ అయ్యింది. ఎవరైన బిల్డర్లు కబ్జా చేశారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి చెరువు నుంచి వరద నీరు ప్రవహించేందుకు కాలువ ఉంటుంది. ఈ కాలువను ఇష్టానుసారంగా ఎక్కడ బడితే అక్కడ కబ్జా చేయడంతోనే నేడు ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

భరించలేని దుర్గంధం

బాచుపల్లి పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణాలు ఎక్కువ. ఇక్కడ పని చేసే కార్మికులు వందల సంఖ్యల్లో ఉంటారు. చుట్టూ గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ఇలా అన్ని ప్రాంతాల నుంచి మురుగు వచ్చి దిగువకు ప్రవహించకుండా నాలాలోనే నిల్వ ఉంటుంది. దీంతో భరించలేని దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమల వల్ల డెంగీ లాంటి విష జ్వరాల బారిన పడుతున్నారు. ప్రతి నిత్యం ఏదో ఒక సమస్యతో ఆసుపత్రి పాలవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా ఓపెన్ నాలా

నాలా విస్తరణ పనులు చేపట్టిన అధికారులు నాలా చుట్టూ ప్రమాదాలు జరుగకుండా మెష్(జాలి) చుట్టినా అది పూర్తి స్థాయిలో లేకపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో వరద ప్రవాహం తీవ్రంగా ఉంటుంది. అక్కడ నాలా ఉందన్నట్లు కనిపించనంత స్థాయిలో వరద ప్రవహిస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. వర్షాలు పడే సమయంలోనే కాకుండా ప్రస్తుతం కూడా నాలా ప్రమాదకరంగా ఉందని, చిన్న పిల్లలు, వృద్ధులు అందులో పడే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మా గోడు ప్రభుత్వం వినాలి



తమ చుట్టూ ఉన్న నాలాలోని మురుగు నీటితో దుర్గాంధాన్ని భరించలేకపోతున్నాం. ఇంట్లో ప్యూరిఫైయర్స్ పెట్టుకునే పరిస్థితి వచ్చిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో ఆలోచించండి. స్వచ్ఛమైన గాలిని కూడా పీల్చలేని దుస్థితిలో ఉన్నాం. మా గోడు ప్రభుత్వం వినాలి.

– దీప్తి, బాచుపల్లి.

దుర్గంధం మరింత పెరిగింది



బాచుపల్లి పరిసర ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న భవనాల్లో పని చేసే కార్మికుల కోసం తాత్కాలిక టాయిలెట్స్‌ను ఏర్పాటు చేశారు. ఆ టాయిలెట్స్‌ను మొత్తం ఈ నాలాకు నేరుగా కనెక్ట్ చేయడంతో ఈ దుర్గంధం మరింత పెరిగింది. నాలాలోకి వచ్చిన మురుగు నీరు కనీసం ముందుకు కూడా ప్రవహించకుండా ఇక్కడే నిలిచిపోవడంతో సమస్య తీవ్రత చెప్పలేనంతగా ఉంది.

– అనిత,బాచుపల్లి.

తిరిగి తిరిగి అలసి పోయాం



తాము ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని రెండు సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. అయినా సమస్య పరిష్కారం కావడం లేదు. ప్రతి నిత్యం వేలాది మంది ప్రజలు ఎదుర్కొనే ఇంతటి ప్రమాదరకమైన సమస్యను పరిష్కరించడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో తమకు అర్థం కావడం లేదు.

– శివశంకర్‌రెడ్డి, కాసాని కృష్ణ కాలనీ, బాచుపల్లి.

సమస్యను వెంటనే పరిష్కరించాలి



బాచుపల్లిలో ఎస్ఎన్‌డీపీ నాలా విస్తరణ పనులు పూర్తి అయ్యే విధంగా ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలి. కోట్ల రూపాయలతో పనులు చేసినా ఉపయోగంలో లేదు. ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను గుర్తించి పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలి.

– కాసాని సుధాకర్, కార్పొరేటర్ బాచుపల్లి

4 నుంచి కార్తీకమాసం పూజలు

సుభాష్‌నగర్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శివాలయ నగర్‌లోని ఉమామహేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయన ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 4వ తేదీన కార్తీక మాస మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామి వారికి అభిషేకాలు, 5న నాగుల చవితి సందర్భంగా పుట్ట వద్ద విశేష పూజా కార్యక్రమాలు, 11న ఉదయం అభిషేకాలు, సాయంత్రం జ్యోతిర్లింగార్చన, 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, సాయంత్రం లక్ష వత్తులతో దీపారాధన, స్వామివారికి పల్లకీసేవ, జ్వాలా తోరణం తదితర కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులు వయోపరిమితి లేకుండా అందరికీ అవకాశం కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కంప్యూటర్ బేసిక్స్, ఇంగ్లిష్ టైపింగ్‌పై శిక్షణ ఇస్తారన్నారు. కనీస విద్యార్హత 7వ తరగతి కలిగి ఉన్న వారు 10వ తేదీ లోగా సుందరయ్య భవన్‌లో దరఖాస్తులు అందజేయాలని, ఇతర వివరాలకు 7416500946 నెంబరులో సంప్రదించాలని కోరారు.

బస్తీ దవాఖానాల్లో మందులు అందుబాటులో ఉండాలి



సమస్యలు తెలుసుకుంటున్న సీపీఐ నాయకులు

జగద్గిరిగుట్ట: మందులు లేకుండా బస్తీ దవాఖానాలు నడిపించడం వృథా అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేశ్ అన్నారు. శుక్రవారం శ్రీనివాస్‌నగర్‌లోని ఈ సేవా సెంటర్ వద్ద ఉన్న బస్తీ దవాఖానాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీ దవాఖానాలో కనీసం బీపీ, షుగర్ లాంటి వాటికి కూడా మందులు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్న మందులు కూడా కనీసం 10 రోజులకు సరిపోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు సదానంద్, సహదేవ్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు రాములు, జైపాల్ రెడ్డి, నాయకులు బాబు, స్థానికులు ఖయ్యూం, క్రాంతి, ఇమామ్ పాల్గొన్నారు.

అనుమతిలేని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

నిజాంపేట్: అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఓ ఇంటర్నేషనల్ హైస్కూల్ విద్యాశాఖ నుంచి అనుమతులు పొందకుండానే స్కూల్‌ను ప్రారంభించారని ఆరోపించారు. ఈ విషయమై డీఈవో, ఎంఈఓలకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

మూతను ఏర్పాటు చేయరా?



చింతల్: నీటి సరఫరా నిరాటకంగా కొనసాగేందుకు ఏర్పాటు చేసిన మ్యాన్‌వాల్వ్ చాంబర్ల నిర్వహణ కొరవడింది. జగద్గిరిగుట్ట రిజర్వాయర్ ఎదురుగా ఉన్న మ్యాన్‌వాల్వ్ చాంబర్ శిథిలావస్థకు చేరుకుంది. దానికి మరమ్మతులు చేయించాల్సిన జలమండల అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడటం లేదు. ఈ చాంబర్‌కు మూత లేకపోవడంతో అది ప్రమాదకరంగా మారింది. చిన్నారులు అటువైపు వచ్చి అందులో పడి ప్రమాదాల బారిన పడే ఆస్కారముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాంబర్ మూతను ఏర్పాటు చేయడంలో జలమండలి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..

కార్మిక హక్కుల కోసం పోరాటాలు

కుత్బుల్లాపూర్: కార్మికులకు అందాల్సిన న్యాయపరమైన హక్కులను సాధించేందుకు ఎంత వరకైనా పోరాడుతానని ఐఎన్‌టీయూసీ నాయకుడు చింతల నాగరాజు అన్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని జీడిమెట్ల పారిశ్రామికవాడలో యూనియన్ అధ్యక్షుడిగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పలు కంపెనీల కార్మికులు మర్యాదపూర్వకంగా కలిశారు. బోనస్ ఇప్పించినందుకు థర్మో కేబుల్, ప్రుమా పేపర్, కేషన్ రాజ్ క్లాసిక్, సాయినాథ్ కంపెనీల కార్మికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వాసు నాయుడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గాజులరామారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప స్వామి మాలధారణ, ఇరుముడి 150 మంది స్వాములతో శబరిగిరీశా మహా పాదయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. సోములు యాదవ్, బుచ్చిబాబు, బాలు గురుస్వాముల ఆధ్వర్యంలో 41 రోజుల పాటు భూ లక్ష్మమ్మ దేవాలయం బేగంపేట్ నుంచి శబరికి మహా పాదయాత్ర చేస్తున్న సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్ రెడ్డి పూజలో పాల్గొన్నారు. – కుత్బుల్లాపూర్

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



వివరాలు సేకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

దుండిగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేశామని, వార్డుల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. వివరాల సేకరణ అనంతరం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే స్టిక్కర్‌ను అంటిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ప్రత్యేక అధికారి బాబు, మున్సిపల్ మేనేజర్ సునంద, సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేం



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కూన శ్రీశైలంగౌడ్ తదితరులు

కుత్బుల్లాపూర్: ఉక్కు మహిళగా దేశ కీర్తిప్రతిష్టలను ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ ఇందిరాగాంధీ అని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం షాపూర్ నగర్‌లోని ఆయన నివాసంలో ఇందిరాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి ఆమె చేసిన సేవలను మరువలేమని అన్నారు. పేద ప్రజల సంక్షేమానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారన్నారు. విపత్కర పరిస్థితులను తట్టుకుని ఎన్నో విజయాలు సాధించిన ఆమె నేటి మహిళా లోకానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో గూడ ఐలయ్యగౌడ్, రషీద్ బేక్, జయరామ్, బండి శ్రీనివాస్‌గౌడ్, రాఘవేంద్రగౌడ్, పాలకృష్ణ, షాకీర్, బాలప్ప, వెంకటేశ్వర్ రెడ్డి, ధర్మారావు, తుకారం తదితరులు పాల్గొన్నారు.

నేడు సన్నాహక సమావేశం

కుత్బుల్లాపూర్: జిల్లా కుల గణన సన్నాహక సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొంపల్లిలోని కేవీఆర్ గార్డెన్స్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

బాలానగర్: శ్రీశ్రీ నగర్‌లో ఏఐటీయూసీ మండల సమితి ఆధ్వర్యంలో ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ మండల కార్యదర్శి జి. కృష్ణ హాజరై కార్మిక జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలు చేసి తెచ్చుకున్న కార్మిక చట్టాలను నేటి ప్రభుత్వాలు రద్దు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో అన్నదానం

ఆల్విన్‌కాలనీ: రాజేశ్వరి వృద్ధుల అనాథాశ్రమానికి సేవా దృక్పథంతో సీపీఎం కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో వంద మంది అనాథలకు భోజనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం కూకట్‌పల్లి శాఖ కార్యదర్శి పి. ధర్మారావు, కమిటీ సభ్యులు జే. బాలరాజ్ మాట్లాడుతూ..మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద మనుషులను తమ కు టుంబాల నుంచి దూరం పెడుతూ అనాథాశ్రమంలో వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి



వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

నిజాంపేట్: భారత తొలి ఉప ప్రధాని, ఉక్కు మనిషి వల్లభాయ్ పటేల్ జయంతిని శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో డాక్టర్ ఎం.ఆర్.ఎస్.రాజు ఆధ్వర్యంలో వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిలటరీ చర్య ద్వారా నిజాం పాలనలో మగ్గుతున్న తెలంగాణ ప్రాంతానికి విముక్తి కలిగించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, కార్యదర్శి ప్రొఫెసర్ చంద్రమౌళి, రచ్చ చక్రధర్, అల్వాల దేవేందర్ రెడ్డి, నాగిశెట్టి శేషారావు, మైలారం అశోక్, కౌశిక్ నాయుడు, రామారావు, వీరాంజనేయులు, బాబు, అప్పల రాజు, మయూర్ పటేల్, కిశోర్, జగదీశ్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మురుగు పారుతున్నా పట్టించుకోరా?




నడవడానికి కూడా వీలు లేకుండా రోడ్డుపై నిలిచిన డ్రైనేజీ నీరు

దుండిగల్: అక్కడి ప్రజలు నిత్యం మురుగుతో సహవాసం చేస్తున్నారు. ప్రతి రోజు ఇళ్ల మధ్య నుంచే డ్రైనేజీ నేరు ప్రవహిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముక్కుపూటలు అదిరేలా దుర్వాసనతో కనీసం భోజనం కూడా చేయలేని పరిస్థితిలో ఉన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి సాయిపూజ కాలనీలో ఈ పరిస్థితి ఏర్పడింది. ఎన్నో సార్లు స్థానిక ప్రజా ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



మ్యాన్‌హోల్ నుంచి వస్తున్న మురుగు నీరు

మద్యం మత్తులో గొడవ.. కేసు నమోదు

కేపీహెచ్‌బీకాలనీ: దీపావళి పండుగ జరుపుకుని అల్పాహారం తినేందుకు వచ్చిన ఐదుగురు మూత్రశాలను వినియోగించుకునే క్రమంలో మరో 8 మందితో గొడవపడి చితకబాదారు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ రూప వివరాల ప్రకారం.. మియాపూర్ ప్రాంతంలో నివాసం ఉండే సత్య కల్యాణ్ మరో నలుగురు స్నేహితులతో కలిసి భాగ్యనగర్ కాలనీ ప్రాంతంలోని సిరి టిఫిన్ సెంటర్‌కు వచ్చారు. వీరంతా మూత్రశాలకు వెళ్లడంతో అప్పుడే అక్కడికి వచ్చిన కేపీహెచ్‌బీ కాలనీ ప్రాంతానికి చెందిన తేజా అలియాస్ లడ్డు మరో ఏడుగురు స్నేహితులు కూడా మూత్రశాల వద్ద వేచి ఉండటంతో పాటు ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో బయట డోర్ కొట్టి పిలిచారు. దీంతో లోపలి వైపు నుంచి తిట్లు వినిపించడంతో వారు బయటకు రాగానే తేజా అతని స్నేహితులు గొడవ పడ్డారు. ఇరువురి నడుమ గొడవ పెద్దదిగా మారి కర్రలతో దాడి చేసుకున్నారు. దీంతో సత్య కల్యాణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.